ప్రజాశక్తి
శుక్రవారం 23 మార్చి 2023
5
పార్వతీపురం మన్యం

గిరిజన గురుకులాల్లో టీచర్ పోస్టులు భర్తీ

ప్రజాశక్తి - కలెక్టరేట్

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల గిరిజన గురుకుల నందు 2022-23 విద్యా సంవత్సరమునకు గాను ఖాళీ పోస్టు నందు ఔట్ సోర్సింగ్ టీచర్లుగా పనిచేసేందుకు టెట్ ఉత్తీర్ణులై, డిగ్రీ, పిజి ఇన్ కోర్సుల్లో ఇంగ్లీష్ మీడియంలో చదివి ఆసక్తి, అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరడమైనదని పిఒ సి.విష్ణుచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు స్వీకరించేందుకు గురుకులం సెల్ పార్వతీపురంలో ఆఖరు తేదీ ఈనెల 28న సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు సేకరిస్తారని, టీచర్స్ పోస్టుకు డెమో నిర్వహించేందుకు ఈనెల 31, ఏప్రిల్ 1న టీచర్స్ పోస్టుకు డెమోను స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, జోగింపేటలో నిర్వహిస్తారని, ఈ పోస్టులకు గానూ పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులని తెలిపారు.

అకాల వర్షానికి చెరువైన పెదమార్కెట్

- ఆందోళనలో వ్యాపారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

వర్షానికి చెరువును తలపిస్తున్న పెదమార్కెట్

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో గురువారం కురిసిన అకాల వర్షానికి పెద్ద మార్కెట్‌లో కొన్ని షాపుల ముందు చెరువులను తలపించేలా నీరు నిల్వ వుండిపోయింది. దీంతో దుకాణాలకు రాకపోకలు సాగించే వారికి తీవ్ర అసౌకర్యం కలిగింది. షాపుల ముందు వర్షపు నీరు నిల్వ వుండి పోవడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. నీరు బయటకు వెళ్లే మార్గం లేక పోవడంతో మార్కెట్ మొదటి వరుసలో ఉన్న షాపుల ముందు చెరువుల్లా నీరు నిలిచిపోయింది. వేసవిలో అకాల వర్షానికే పెదమార్కెట్‌లో పరిస్థితి ఇలా ఉంటే వర్షాకాలంలో వచ్చే వర్షాలకు ఎలా ఉంటుందోనని చిరువ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు.

కొత్త మార్కెట్ నిర్మాణానికి నిధులొచ్చినా...

ఇప్పుడున్న పెద్ద మార్కెట్ ప్రదేశంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న షాపుల్లో అధికం ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యాపారుల చేతుల్లో ఉన్నాయి. దశాబ్దాల కాలం నాటి లీజుదారులే ఇక్కడ రాజ్యమేలుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ ఉన్న మెజారిటీ దుకాణాలు కేవలం నాలుగైదు కుటుంబాలకు చెందిన వ్యాపారుల గుత్తాధిపత్యంలో నడుస్తున్నాయి. మున్సిపాలిటీకి నామమాత్రపు రుసుము చెల్లించి షాపులను అధిక మొత్తాల్లో అద్దెకు ఇచ్చుకుంటు న్నారు. దీంతో ఏటా మున్సిపల్ ఖజానాకు ఏటా లక్షలాది రూపాయల గండి పడుతోంది. ఇలా జరుగుతుందని తెలిసినా పాలకవర్గాల తీరులో మార్పు లేదు. కొద్దినెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు మార్కెట్లో కొన్ని శిథిలావస్థలో ఉన్న షాపులు కూలి పోయాయి. పెదమార్కెట్‌కు సంబంధించి కోర్టులో ఉన్న కేసులో మున్సిపాల్టీకి అనుకూలంగా తీర్పు కూడా వెలువడింది. కోర్టు పరమైన అడ్డంకులు లేకపోయినా, కొంతమంది వ్యాపారుల ప్రయోజనాలే పరమావధిగా పాలకవర్గ సభ్యులు కొత్త మార్కెట్ నిర్మాణానికి నిర్ణయం తీసుకోలేక పోతున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే పాలక వర్గ సభ్యులు, ప్రజాప్రతి నిధులు పెద మార్కెట్ నిర్మాణానికి చొరవ తీసుకోవడం లేదన్నది జగమెరిగిన సత్యం.

పట్టించుకోని అధికారులు, పాలకవర్గం

పట్టణంతో పాటు సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన ప్రజలకు ప్రధాన మార్కెట్ ఇదే. ఇలాంటి మార్కెట్‌ను గత కొంతకాలంగా మున్సిపల్ అధికారులు, పాలకవర్గాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. వర్షాలు పడే సమయంలో మార్కెట్లోకి సరుకుల కొనుగోలు కోసం వెళ్లాలంటే నరకయాతన పడాల్సిందే. ఇంటర్నల్ రోడ్లు, కాలువలు లేకపోవడంతో దశాబ్దాల కాలంగా మార్కెట్ అసౌకర్యాలకు నిలయంగా మారుతోంది. ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు దోమలు వృద్ధి చెందడంతో మార్కెట్లో నిత్యం దుర్గంధం వెదజల్లే పరిస్థితి వుంది.

కొత్త బ్యాంకు శాఖలకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలో ఆరు కొత్త బ్యాంకు శాఖల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో కొత్త బ్యాంకుశాఖల ఏర్పాటును చర్చించామని, ఆ మేరకు ప్రతిపాదనలు తయారు చేసి రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపించామని చెప్పారు. వీటిలో జియ్యమ్మవలస మండలం బొమ్మిక, భామిని మండలం గురండి గ్రామాల్లో ఎస్‌బిఐ శాఖల ఏర్పాటుకు, కొమరాడ మండలం గంగరేగువలస, పాచిపెంట మండలం మత్తుమూరులో బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలు, కురుపాం మండలం మొండెంఖల్లు, పాచిపెంట మండలం పి.కోనవలస మండలంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలు ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఎస్‌బిఐ ఇప్పటికే సర్వే చేపట్టింది. జియ్యమ్మవలస మండల కేంద్రంలోను, భామిని మండలం బత్తిలిలో బ్యాంకు శాఖలను ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు తెలియజేసింది. కొత్త బ్యాంకు శాఖలు ప్రారంభమైతే ఆయా ప్రాంతాల్లో బ్యాంకు సేవలు విస్తతమవుతాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల కింద అందుతున్న ఆర్థిక సహాయం తమ దగ్గర్లోని శాఖల్లో లభ్యమవుతాయి. ప్రస్తుతం విస్తరిస్తున్న ఆధునిక బ్యాంకు సేవలు ప్రజలకు మరింత చేరువై జీవితాల్లో మార్పులు రాగలవని జిల్లా కలెక్టర్ అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, పక్కన జెసి, ఐటిడిఎ పిఒ, డిఆర్ఒ

పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డిని కోరారు. జిల్లా కలెక్టర్లతో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని పాఠశాలలకు పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయాల్సి ఉందని, వాటిని విడుదల చేయాలని కోరగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందిస్తూ విడుదల చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ రక్తహీనతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, మెరుగుకు జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలకు, మౌలిక సదుపాయాల కల్పన చేయాలని సూచించారు. టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమం సంతృప్తి మేరకు ఉండాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజుల వీణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, డిఇఒ డాక్టర్ ఎస్‌డివి రమణ, ఐసిడిఎస్ పిడి కె.విజయగౌరి, సిపిఒ పి.వీర్రాజు పాల్గొన్నారు.

సిఎం జగన్‌కు వినినిఅందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సిఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

సీతంపేట : పాలకొండ నియోజకవర్గ ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రాన్ని ఎమ్మెల్యే వి.కళావతి గురువారం అందజేశారు. సీతంపేట, వీరఘట్టం, భామిని మండలాల పరిధిలో గల గిరిజన, మైదాన ప్రాంతాల్లో తిష్ట వేసి ఉన్న ఏనుగులను తరలించారు. ఏనుగుల బాధితులను ఆదుకోవాలని కోరారు. అలాగే భామిని మండల చిన్న దిమిలి పక్క నుంచి మెయిన్ కెనాల్ నుంచి సాగునీరందించాలని, బాలేరు, వీరఘట్టం, బాలేరు పిహెచ్‌సిలను సిహెచ్‌సిలు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. వీటితో పాటు నియోజకవర్గంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పిల్లలు, గర్భిణుల ఆధార్ నమోదుకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో పిల్లలు, గర్భిణీల ఆధార్ అప్ డేట్ చేసేందుకు వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. మండలంలోని నర్సిపురం సచివాలయాన్ని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బెనిఫిషియరి అవుట్ రీచ్ ప్రోగ్రాం (బి.ఒ.పి) యాప్, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ యాప్‌ల్లో డేటా అప్ డేట్ ను పరిశీలించారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదుతో పాటు, గర్భిణీ స్త్రీలకు ఆధార్ అప్ డేట్, ఆర్.సి.హెచ్ ఐడి జారీ ప్రక్రియ విధిగా జరగాలని ఆయన స్పష్టం చేశారు. నర్సిపురం పరిధిలో ఎనిమిది అంగన్వాడీ కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో 52 మంది గర్భిణీలకు గానూ 49 మందికి ఆధార్, ఆర్‌సిహెచ్ ఐడి జారీ ప్రక్రియ పూర్తి అయ్యింది. బాలింతలు 50 మంది ఉండగా 48 మంది అనుసంధానం పూర్తయ్యింది. మిగిలిన ఇద్దరు వివరాలు సరిపోనట్లు చూపిస్తుంది. సాంకేతిక సమస్యలు ఎప్పటి కప్పుడు సరిచేస్తూ వివరాల అప్ లోడ్ జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ యాప్‌ల్లో వివరాలు పూర్తి స్థాయిలో ఉండడం వల్ల రక్త హీనత, సంపూర్ణ పోషణ పంపిణీ వంటి కార్యక్రమాలను పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయవచ్చని ఆయన అన్నారు. ఈనెల 27,28, 29 తేదీల్లో ఆధార్ అప్ డేట్ చేసేందు కు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి, డిపిఒ బి.సత్యనారాయణ, ఐసిడిఎస్ పిఒలు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎ.ప్రభాకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే వి.కళావతి ఎమ్మెల్సీ పి.విక్రాంత్ హాజరుకానున్నారని తెలిపారు. కావున సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మండల స్థాయి అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

దేశభక్తి, త్యాగనిరతికి ప్రతీక భగత్‌సింగ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

భరతమాత దాస్య శృంఖలాలు తెంచేందుకు చిరునవ్వుతో ఇరవైమూడేళ్లకే ఉరికంబమెక్కిన వీర కిశోరాలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్ అన్నారు. భగత్ సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద గల భగత్‌సింగ్ విగ్రహానికి డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు పూలమాల వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దేశాన్ని అజ్ఞాన అంధకారంలోకి నెట్టేసిన పెత్తందారీతనం పోవాలన్నా, స్వాతంత్ర్య సాధనతో పాటు విప్లవం వర్ధిల్లాలని నినదించిన విప్లవ వీరుడు భగత్ సింగ్ అని, నేటి యువతరానికి ఆదర్శమని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ మాట్లాడుతూ నేడు అదానీ అంబానీ వంటి దోపిడీ శక్తులు బ్రిటిష్ వారి దోపిడీని మించిపోగా ఆ దోపిడిగాళ్లకు మతోన్మాదం తోడై దేశం అథమ స్థానానికి చేరుతుందని, దీంతో మానవాభివృద్ధి సూచికలన్నింటిలో మనదేశామే అథమ స్థానంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం ఎందుకింత హీన స్థితిలో ఉందో భగత్‌సింగ్ భావనలతో నేటి యువతరం ఆలోచించాలని కోరారు. భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో రాజ్యాంగం కల్పించిన హక్కులకై విద్యార్థులు, యువకులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్పొరేట్, మతోన్మాద నిరంకుశ కోరల్లో నలిగిపోతున్న భారతదేశాన్ని విముక్తి చేయడానికి, సకల ప్రజానీకాన్ని సమీకరించి పోరాటాలు నిర్వహించడం ద్వారా మరో నూతన సమాజ నిర్మాణానికై కదిలి పనిచేస్తామని, సమసమాజ నిర్మాణానికి పూనుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్నాం. దేశం కోసం, ప్రజల కోసం సొంత ప్రయోజనాలు పక్కనపెట్టి నిస్వార్ధంగా నిజాయితీగా ప్రజల కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు బంటు ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.పండు, సొంటేన భాస్కరరావు, కూర్మారావు, ఎస్.భారత్‌కుమార్, కె.భాస్కరరావు, పి.దుర్గాప్రసాద్, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యాన

భగత్ సింగ్, రాజ గురు, సుఖదేవ్ లు నిజమైన దేశభక్తులని కవి, రచయిత గంటేడ గౌరునాయుడు అన్నారు. ఈమేరకు గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గిరిజన సామాజిక భవనంలో భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ ల వర్ధంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా గౌరునాయుడు మాట్లాడుతూ యువత, విద్యార్థులు సామాజిక అంశాలపై స్పందించాలని కోరారు. విశ్రాంత ఉపాధ్యాయులు చుక్క పారినాయుడు, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు పాలక రంజిత్ కుమార్, చందు, గిరిజన నిరుద్యోగ సంఘం నాయకులు, ఆరిక ప్రభాకర్, బొండపల్లి జనార్దన్ పాల్గొన్నారు. పట్టణంలోని భగత సింగ్ విగ్రహం వద్ద పలువురు ప్రజా సంఘాల నాయకులు భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాచిపెంట : సిఐటియు డివైఎఫ్ఐ ఐద్వా నాయకులు పి.తరుణ్ కుమార్. ఎస్‌సూర్య, ఎన్ శంకర్రావు, బి అచ్చియమ్మ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలకు పెంచిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఘన నివాళ్లు

పార్వతీపురంలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

సీతంపేట: స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో భాషా వాలంటీర్ల సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్ 92 వర్ధంతి సభ నిర్వహించారు. గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజనులు, భాషావాలంటీర్లు భగత్ సింగ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం నాయకులు అప్పారావు, గంగాధర్, భాస్కరరావు, సవర భాషా వాలంటీర్ల సంఘం అధ్యక్షులు డోంబు రాజు తదితరులు పాల్గొన్నారు

పాలకొండ: సిఐటియు డి.వై.ఎఫ్.ఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ 92వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. తొలుత భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మండల కార్యదర్శి కాద రాము, డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు గుండు సుధీర్, కెవిపిఎస్ మండల కార్యదర్శి దూసి దుర్గారావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు బి.పట్టాభి, కె.శ్రీనివాస్, పి. సంగమేశు, గిరి హేమ సుందరరావు, ఆర్. ఆనంద్, బి. రవి, గోవింద, ప్రసాదరావు, జయరాం, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని బుడ్డిపేటలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సంధర్భంగా భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, ప్రజా సంఘాల నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, పి.చిన్నారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి సభ జరిగింది. కార్యక్రమంలో రైతు, వ్యవసాయ కార్మికసంఘాల ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, వి.సత్యంనాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ భగత్ సింగ్ కలలను నెరవేర్చడానికి విద్యార్థులు, యువత, కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటస్వామి, సురేంద్ర, కూర్మ, మహేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో అశువులు బాసిన భగత్‌సింగ్ ఆశయాలు యువతకు ఆదర్శం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి ఎర్నైనాయుడు అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ పోస్ట్ మెట్రిక్ బాలురు హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టడమే ధ్యేయంగా పని చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని యువకులు, విద్యార్థులు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు పి.వరుణ్, భాస్కర్ పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : భగత్‌సింగ్, రాజ్ గురు,సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని 25వ వార్డు మద్దాలవారివీధిలో (బొగ్గులువీధి) సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సభ్యులు పాకల సన్యాసిరావు ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం, ప్రజలకోసం నిస్వార్ధంగా, నిజాయితీగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గుడిపూరు కృష్ణ, లాడి వరప్రసాద్, శిరేల శ్రీను, బుగత కృష్ణ, కంగటి శ్రీను, బూర్లి కిరణ్, యడగల బుజ్జిబాబు పాల్గొన్నారు.

బలిజిపేట, సాలూరు భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి : డిఇఒ

ప్రజాశక్తి - కొమరాడ

పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్‌వి రమణ అన్నారు. మండలంలోని కొమరాడ, కోటిపాం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండి పెడుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలు అనుసరిస్తూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. అనంతరం పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తరగతి గదులను సందర్శించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో జరగనున్న పదవ తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థుల్లో ఉన్న అపోహలకు జవాబు ఇస్తూ ధైర్యం చెప్పారు. విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. పరీక్షలకు భయంతో కాకుండా ధైర్యంతో రాస్తే మంచి ఉత్తీర్ణత సాధించవచ్చని అన్నారు. పలు సబ్జెక్ట్‌ల్లో వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయనతో పాటు ఎంఇఒ జామి నారాయణ స్వామి తదితరులు ఉన్నారు.

రూ.10కోట్ల పాఠశాల భవన నిర్మాణం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి సబ్‌డివిజన్ పరిధిలోని మొండెంఖల్‌లో రూ.10కోట్ల నిధులతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణాన్ని ప్రారంభించినట్లు భద్రగిరి గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలం తెలిపారు. రాబోవు 9 నెలల్లో ఈ పనులను పూర్తి చేస్తామని, పనులు చురుగ్గా జరుగుతున్నాయని చెప్పారు. ఇదిలా ఉండగా గిరిజన ప్రాంతంలో మారుమూలకొండ శిఖర గ్రామాలకు రహదారులను నిర్మించడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ఈ పనులకు పరిపాలన ఆమోదముద్ర వచ్చిన తర్వాత ఆయా పనులు ప్రారంభిస్తామని డిఇ సింహాచలం తెలిపారు.

గంటేడకు 29న పతంజలి పురస్కార ప్రదానం

ప్రజాశక్తి-విజయనగరం

ప్రముఖ కవి, గేయ రచయిత గంటేడ గౌరునాయుడికి పతంజలి పురస్కారం ఈనెల 29న ప్రదానం చేయనున్నట్లు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి తెలిపారు. గురువారం స్థానిక గురజాడ అప్పారావు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయుడు, పలు పత్రికలకు సంపాదకులుగా పనిచేసిన కెఎన్‌వై పతంజలి పేరున ప్రతి ఏడాది అందించే పురస్కారం ఈ ఏడాది గంటేడ గౌరునాయుడుకు బుధవారం ఉదయం గురజాడ పబ్లిక్ స్కూల్లో అందజేయనున్నట్లు తెలిపారు. స్నేహ కళా సాహితీ ని స్థాపించి ఉత్తరాంధ్ర నుండి ఎందరో కవులను, కథకులను తయారు చేసిన ఘనత గౌరునాయుడి మాస్టారికే దక్కుతుందని భీశెట్టి అన్నారు. వేదిక కార్యదర్శి ఎన్ కె బాబు మాట్లాడుతూ పతంజలి పేరుతో ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ప్రముఖ రచయితలు మోహన్, మహర్షి, దేవిప్రియ, సతీష్ చంద్ర, చింతికింది, అట్టాడ అప్పలనాయుడు, పప్పు అరుణలకు అందచేసామని, 2023లో గంటేడ గౌరునాయుడిని ఎంపిక చేశామని తెలిపారు. పురస్కార ప్రదాన కార్యక్రమంలో సాహితీవేత్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు,పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్రరాజు, ఇప్పలవలస గోపీ, గురజాడ వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గెలుపుతో కలిసిన గ్రూపులు

ప్రజాశక్తి - కురుపాం

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి తరుపున పోటీచేసిన పంచమర్తి అనురాధ గెలుపు సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న రెండు గ్రూపులు ఏకమయ్యాయి. విజయోత్సవ సంబరాల్లో భాగంగా కురుపాంలో గురువారం సాయంత్రం రెండు గ్రూపులకు చెందిన శ్రేణులు మందు గుండు సామాగ్రి కాల్చుకుంటూ కురుపాం పురవీధుల్లో తిరుగుతూ స్వీట్లు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. ఇంతవరకు ఎడమొహం, పెడమొహం ఉన్న రెండు గ్రూపుల టిడిపి శ్రేణులు కలవడంతో టిడిపి కార్యకర్తలు, నాయకుల్లో నూతన ఉత్తేజం వచ్చింది. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి గ్రూపు నుంచి మండల కన్వీనర్ కెవి కొండయ్య తదితరులు పాల్గొనగా మరో గ్రూపు నుంచి చందక రామకృష్ణ, ఎస్.గోవిందు నాయుడు, మాజీ ఎంపిపి జి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో విజయోత్సవ సంబరాలు చేస్తున్న నాయకులు

బొబ్బిలిలో భారీ వర్షం

బొబ్బిలి : బొబ్బిలి, పరిసర ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం మొక్క జొన్న, నువ్వులు పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నలుగురు విద్యార్థులు డిబార్

పూసపాటిరేగ : మండలంలోని కొప్పెర్ల గురుకులంలో గురువారం జరిగిన ఇంటర్ పరీక్షల్లో నలు గురు విద్యార్థులు మాస్ కాపీయిం గ్‌కు పాల్పడుతుం డటంతో డిబార్ చేసినట్లు సిట్టింగ్ స్క్వాడ్ కృష్ణ తెలిపారు. కొప్పెర్ల పాఠశాల పరీక్షా కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు, శ్రీనివాసాజూనియర్ కళాశాలకు చెందిన ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సిపిఎం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. సిపిఎం రాజకీయ ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని బంటు వానివలస, అడ్డాపుశిల, పెద బొండపల్లిలో జరిగిన ప్రచార సమావేశం లో "దేశానికి మోదానిముప్పు" పుస్తకం, కరపత్రం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ మోడీ విధానాలు అదానీ, అంబానీ ఆస్తులు పెట్టుబడులు పెంచేవిగా ఉన్నాయని, ప్రజలపై భారాలు వేసి ప్రభుత్వరంగం బ్యాంకులు, ఎల్ఐసి, విశాఖ స్టీల్ ప్లాంట్లు దోచుకుంటున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలు సమస్యలపై చర్చకు సమయంలేద కాని అదానితో 4గంట రహస్యంగా చర్చలు చేయటానికి సమయం ఉంటుందని విమర్శించారు. గంగవరం పోర్టు, విశాఖ స్టీల్‌ప్లాంటు, విద్యుత్తు ప్రాజెక్టులు దోచుకోవడానికే రహస్య ఒప్పందం ముద్దు పేరు పెండ్లి పిలుపు అని అన్నారు. ఇది రాష్ట్ర వనరులు దోపిడీ చుట్టరికమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బంటు దాసు, కృష్ణ, బి.ఆది, బంటు శివనాయుడు, నారా యణ, ఎ.అప్పారావు, వెంకట్, బోడమ్మ, వినోద్ పాల్గొన్నారు.

దేశానికి మోదాని ముప్పు పుస్తకాలను అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

రీసర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆనంద్

రీసర్వే పనులు వేగవంతం : జెసి

కొమరాడ : మండలంలో జరుగుతున్న భూ రీసర్వేను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ సూచించారు. మండలంలోని ఆర్లలో జరుగుతున్న రీసర్వే స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వే పనులు వేగవంతంగా జరగాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. రీసర్వేలో గుర్తించిన హద్దుల ప్రకారం స్టోన్ ప్లాంటేషన్ సక్రమంగా చేయాలన్నారు. హద్దులకు సంబంధించిన స్టోన్ ప్లాంటేషన్ చేసే సమయంలో సంబంధించిన రైతుల దగ్గరుండి రాళ్లు పాతాలని సూచించారు. ఎందుకంటే భవిష్యత్తులో ఎటువంటి తగాదాలు లేకుండా హద్దులున్న ఇరువురు రైతులను పిలిపించి కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. భూ సర్వే ప్రక్రియ పూర్తయితే రైతులకు ఎటువంటి భూ తగాదాలు, సమస్యలు ఉండవని తెలిపారు. రీసర్వే చేస్తున్న సిబ్బందికి రైతులు సహకారం చాలా అవసరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వే ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ, మండల సర్వేయర్ సోమినాయుడు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

జీతాలు రాక గ్రీన్ అంబాసిడర్ల అవస్థలు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని వివిధ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు (గ్రీన్ అంబాసిడర్లు) ఎనిమిది నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కటిక పేదరికంలో ఉన్న కారణంగా అంతంత మాత్రం జీతం ఇచ్చే గ్రీన్ అంబాసిడర్లుగా పనిచేస్తున్నామని, తమకు ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పారిశుధ్య పనులు చేసే గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వకపోవడం దురదృష్టకరమని పలువురు సర్పంచులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గులిచోడి సాగుపై శిక్షణ

పాచిపెంట : మండలంలోని కేసలిలో రైతు మీసాల మోహ నరావు వినూత్నంగా సాగు చేస్తున్న గులిచోడి విధానంపై వ్యవ సాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అధ్యక్షతన శిక్షణ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎపి సిఎన్ఎఫ్ రీజనల్ ట్రైనింగ్ ఆఫీసర్ హేమ సుందర్ మాట్లాడుతూ ప్రకృతి సేద్య పద్ధతుల్లో గులి చోడి మొట్టమొదటిగా కేసలిలో సాగు చేయడం ఆనందదాయకమన్నారు. అత్యధికంగా చోడి పంట దిగుబడులు పొందడానికి గులి రాగి విధానం ఒక నూతన సాంకేతిక విప్లవమన్నారు. దీన్ని కేసలి నుంచి మండలం మొత్తానికి తీసుకువెళ్లాలని కోరారు. 15 నుండి 20 బస్తాల వరకు దిగుబడులు పొందిన సంఘటనలు ఉన్నాయని, కావున రైతులు గుళి చోడి విధానంపై దృష్టి పెట్టాలని కోరారు. పశువుల గెత్తం లభ్యత లేని ప్రస్తుత తరుణంలో భూమి సారవంతం కావాలంటే నవధాన్యాలు సాగు చేసి భూమిలో కలిగి ఉండాలని, దీనివల్ల సేంద్రియ కార్బన్ శాతం పెరిగి ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధ్యమని తెలిపారు. రైతు మోహన్ రావు గులిచోడి సాగు విధానాన్ని వివరించారు. అనంతరం గ్రామ రైతులకు గులిచోడి క్షేత్రాన్ని చూపించి గ్రామ వ్యవసాయ సహాయకులకు, ప్రకృతి సేద్య అధికారులకు సమావేశం నిర్వహించి గడపగడపకు నవధాన్యాల సాగును, గుళిరాగి పద్ధతులను తీసుకువెళ్లా పనిచేయాలన్నారు. ప్రతి ఆర్‌బికె పరిధిలో గల చిరుధాన్యాల సాగును పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎఇఒ హైమావతి, ప్రకృతి సేద్య అధికారులు యశోదమ్మ, బాలకృష్ణ, తిరుపతినాయుడు, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రినాథులు

సచివాలయం సందర్శన

పాలకొండ రూరల్ : మండలంలోని తుమరాడ గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినా థులు గురు వారం సందర్శిం చారు. సిబ్బంది హాజరుతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరుకావాలని, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు.

ప్రభుత్వ పనులపై అపోహలొద్దు

సీతంపేట : ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన వివిధ పనులపై అపోహలొద్దని, వెంటనే పనులు పూర్తి చేయాలని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇంజనీరింగ్ అధికారులు, సర్పంచులు ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల మండలంలో తొమ్మిది సచివాలయాల్లో 13 పంచాయతీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసుకొని 91 పనులకు రూ.కోటీ 65 కోట్లు మంజూరయ్యాయని అన్నారు. ఇప్పటికే సోమగండిలో 3, కిండంగి, కుసిమి, కుడ్డపల్లిలో ఒక్కొక్కటి పని పూర్తయ్యాయని తెలిపారు. పనులు పూర్తి చేసిన వెంటనే బిల్లును చెల్లిస్తామని అన్నారు. సమావేశంలో ఎంపిపి బి.ఆదినారాయణ, వైసిపి నాయకులు ఎస్.రాము, సర్పంచులు ఆదిలక్ష్మి, కళావతి, బాపయ్య, జెఇలు పవన్ కుమార్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు వేగవంతం

వీరఘట్టం : మండలంలో అర్థాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల పరిషత్ పరిపాలన అధికారి ఆర్‌వి రమణ ఇంజనీరింగ్ సహాయకులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భవనాలకు సంబంధించి పనులు చేసిన మేరకు బిల్లులు కూడా చెల్లింపులు జరిగినట్లు స్పష్టం చేశారు. మండలంలోని చిన్నగార కాలనీ, నడిమికెల్లా, వీర ఘట్టం సచివాలయం 3, కత్తుల కవిటిలో ఇటీవల నిర్వహించిన గడపగలకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మురికి కాలువలు, రహదారులపై వచ్చిన నిధులు మంజూరయ్యాయని, వాటిపై కూడా దృష్టి పెట్టి త్వరగా పనులు చేపట్టాలని అన్నారు. సచివాలయం వారిగా సమీక్షించారు. నిర్మాణం చేపడతామని అడ్వాన్స్ తీసుకున్న వారు కూడా తక్షణంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఇంజనీరు కల్యాణదుర్గ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పాపారావు, ఇంజనీరింగ్ సహాయకులు ఉన్నారు

25న మెగా కిసాన్ మేళా

సీతంపేట : జిల్లాలో ఈనెల 25న రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం మెగా కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త అధిపతి డాక్టర్ సీతారాం తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం పార్వతీపురం మన్యం జిల్లా ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం సంయుక్తంగా ఈ భారీ కిషన్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అగ్రికల్చర్ టూరిజం రైతులు సాధికారిక యాంత్రీకరణ డ్రోన్ తదితరమైనవి నిరిసిస్తున్నట్లు రైతులు రావాలని కోరారు.

'చలో ఢిల్లీ' విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

కార్మిక, కర్షకుల హక్కుల కోసం ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మికులు, కర్షకులు, పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల కేంద్రంలో చలో ఢిల్లీ కార్యక్రమం గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులు, ప్రజా సమస్యలను మరింత జటిలం చేస్తూ వారి న్యాయబద్ధమైన కోర్కెలను ఆమోదించకుండా కార్పొరేట్లకు అదాని, అంబానీ వంటి వారి సేవలో మునిగితేలుతుందని విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు, ఉపాధి భద్రత, పిఎఫ్, పెన్షన్, ఆరోగ్య సౌకర్యంతో కూడిన సమగ్ర చట్టం కలగానే మిగిలిపోయిందన్నారు. అలాగే ఏడాదికి 200 రోజులు పని కల్పన, కనీస వేతనం రూ.600 అందని దాక్షగానే మిగిలాయని, కావున ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై పోరాడి ప్రజా అనుకూలత విధానాల అమలు కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్యక్రమానికి కార్మిక, రైతులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కూరంగి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో మాట్లాడుతున్న రమణారావు

పాలకొండ రూరల్ : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న జరుగు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. పాలకొండలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి అవలంబిస్తున్న ఆర్థిక విధానాలు వ్యతిరేకంగా కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించి ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.అమరవేణి, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎన్. హిమప్రభ, జెస్సి భాయ్, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నెలిపర్తిలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం జరిగింది. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు, వ్యవసాయ కార్మిక, గిరిజన భవన కార్మిక సంఘాల నాయకులు ఎ.ఉపేంద్ర, రెడ్డి శివనాయుడు, లక్ష్మయ్య, యామక గౌరునాయుడు, రైతులు రాము, లక్ష్మణరావు, వెంకట్రావు, గౌరునాయుడు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

మక్కువ : మండలంలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 8 సచివాలయాల్లో గుర్తించిన వివిధ పనులకు గానూ రూ.కోటి 60 లక్షల నిధులు మంజూరయ్యాయని పనులు చేసిన వెంటనే సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నామని ఎంపిడిఒ దేవకుమార్, మండల ఇంజనీర్ బి.రజత్ తెలిపారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చప్పబుచ్చంపేట, ఎ.వెంకంపేట, కాశీపట్నం, చెముడు, సరాయివలస, కవిరిపల్లి, వెంకట భైరిపురం, కోన సచివాలయాల పరిధిలోని గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా 65 పనులను గుర్తించామన్నారు. ఇందులో 46 పనులు పంచాయతీరాజ్ సంబంధించినవి కాగా మిగిలిన 19 ఆర్‌డబ్ల్యుఎస్‌కు సంబంధించినవి పనులని తెలిపారు. గతంలో బిల్లులు రాలేదంటూ కొంతమంది వెనుకంజ వేసేవారని, ఇప్పుడు ఆ సమస్య లేదని జెఇ తెలిపారు. సంబంధిత పనుల కోసం ఇంఎండి గతంలో 2.5 శాతం నుంచి ఒక్క శాతానికి తగ్గించామన్నారు. వీటన్నింటిని సంబంధిత కాంట్రాక్టర్లు వినియోగించుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు పది పనులకు ఒప్పందం జరిగిందని, 37 పనులు నామినేటెడ్ చేశామని తెలిపారు. వీటన్నింటిని పూర్తి చేయాలని తెలిపారు. సచివాలయాల పరిధిలోని పనులు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు.

గిరిశిఖర గ్రామాలకు 108 సేవలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ పంచాయతీలో పరిధిలో గల గిరి శిఖర గిరిజన గ్రామమైన కోటకొండలో బిడ్డిక సువాసిని అనే నిండు గర్భిణీ పురిటినొప్పులతో బాధపడుతుండగా వారి బంధువులు 108 వాహనానికి ఫోన్ చేయడంతో మొదటిసారిగా బుధవారం వారి గ్రామానికి వచ్చి ఆమెను మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ మగబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. ఈ సందర్భంగా ఆ గిరిజనులతో మాట్లాడుతూ పంచాయితీ కేంద్రమైన జి.శివడ నుంచి తమ గ్రామానికి ఎనిమిది కిలోమీటర్లు కొండ మీదగా నడిచి ఎక్కే వాళ్లమని అత్యవసర సమయంలో గర్భిణీకైనా, అనారోగ్య స్థితిలో ఉన్న సమయంలోనైనా డోలీమోతతో పంచాయతీ కేంద్రానికి తరలించి, అక్కడ నుండి ఆటో ద్వారా ఆస్పత్రికి తీసుకెళ్లే వారమని తెలిపారు. దీంతో పలువురు మార్గమధ్యలో కొందరు ప్రాణాలు విడిచే పరిస్థితి ఉండేదని కానీ ఐటిడిఎ ద్వారా రహదారి నిర్మాణం జరగడంతో ద్విచక్ర వాహనాలు ఆటోలు రాకపోకలు జరుగుతున్నాయని, దీంతో డోలిమాత తప్పి ఆరోగ్యాలు కాపాడుకోవచ్చని చాలా సంతోషంగా ఉందని, ప్రభుత్వానికి అధికారులకు ఆ గ్రామ గిరిజన ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గిరిశిఖర గ్రామమైన కోటకొండలో గర్భిణిని తీసుకెళ్లేందుకు వచ్చిన 108 వాహనం

108,104 వాహనాలకు 5 జి సేవలు అప్ గ్రేడ్

పార్వతీపురం టౌన్ : 108,104 వాహనాల్లో ప్రస్తుతం 2జీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ సేవలు ప్రజలకు మరింత వేగవంతం చేయడానికి 5జి సేవలకు అప్ గ్రేడ్ చేసేందుకు ఉమ్మడి జిల్లాల మేనేజర్ ఎస్.మన్మధనాయుడు పర్యవేక్షణలో పార్వతీపురం మన్యం జిల్లాలో గల 104, 108 వాహనాలన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధానం వల్ల 108, 104 వాహనాలు ఎక్కడ ఉన్నాయో, ఎంత వేగంతో వెళ్తున్నాయనేది తెలుస్తుంది. భవిష్యత్‌లో 108 వాహనం కోసం ఫోన్ చేసిన వారి మొబైల్ నెంబరుకు ఈ లింక్‌ను పంపించామని, దీనివల్ల వారికి ఆ వాహనం ఎంత సమయంలో వస్తోంది, ఎక్కడ ఉందనే విషయం నేరుగా తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో జిపిఎస్ టెక్నీషియన్ వెంకటేష్, ఇఒ ప్రశాంత్, గిరిబాబు, దుర్గాప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు కృషి చేయాలి

సీతానగరం : విద్యార్థులు, చిన్న పిల్లల్లో రక్తహీనత నివారణ దిశగా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన పణుకుపేట, కాసాపేట గ్రామాల్లో పాఠశాలలను, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులకు రక్తహీనత, అందుకు గల కారణాలు, వాటి లక్షణాలు, నివారణా చర్యలపై క్షుణ్ణంగా వివరించి అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. అలాగే పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేయించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య స్థితిని పర్యవేక్షించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. దగ్గరుండి పిల్లల బరువును పరిశీలించారు. పిల్లలకు క్రమం తప్పకుండా వారానికి రెండుసార్లు ఐరన్ సిరప్‌లను ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కాసాపేటలో హెల్త్‌వెల్నెస్ కేంద్రాన్ని సందర్శించి ఒపి రికార్డులు, మందులను పరిశీలించారు. అక్కడ గర్భిణీల ఆరోగ్యాన్ని పర్యవేక్షించారు. గ్రామ ఆరోగ్య పారిశుధ్య, పోషకాహార కమిటీల సమావేశాలను ప్రతి నెలా తప్పకుండా నిర్వహించాలని, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా డిఐఒ వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.రామకృష్ణ, సిహెచ్ ఈశ్వరరావు సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది శైలజ, శ్రీదేవి, ఆశాకార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల బరువును పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

28న ఉచిత కంటి వైద్య శిబిరం

బలిజిపేట : స్థానిక కళింగ వైశ్య కల్యాణ మండపం వద్ద ఈనెల 28న జిల్లా అంధత్వ నివారణ సంస్థ విజయనగరం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీ సత్య సాయిసేవా సమితి కన్వీనర్ వెలది సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28న మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని, వివిధ రకాల కంటే సమస్యలకు సంబంధించిన ప్రముఖ వైద్యులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని పరిసర గ్రామ ప్రజలంతా వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

రైతులను వెంటనే ఆదుకోవాలి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

నియోజకవర్గం పరిధిలో గల జియ్యమ్మవలస, గరుగుబిల్లి, కొమరాడ, కురుపాం మండలాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలు భారీ గాలుల వల్ల అరటి, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, వెంటనే ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం అందించాలని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి డిమాండ్ చేశారు గురువారం మండలంలోని కుదమ, చింతల బెలగాం పంచాయతీల పరిధిలో జగదీశ్వరి, టిడిపి నాయకులు పర్యటించి నష్టపోయిన అరటి, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. క్షేత్రస్థాయి అధికారులు పంటలను పరిశీలించి తగు నివేదికలు జిల్లా అధికారులకు అందించాలని, అరటి, మొక్కజొన్న రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి డొంకాడ రామకష్ణ, అరకు పార్లమెంటు పార్టీ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు, కురుపాం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు జి.రామ్మూర్తినాయుడు, కార్యదర్శి త్రినాథనాయుడు, తోటపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ సత్యంనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు పి.రాంబాబు పాల్గొన్నారు.

అరటిపంటను పరిశీలిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

రైతులను ఆదుకోవాలి

పార్వతీపురంటౌన్ : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు జిల్లాలో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జనసేన నాయకులు కోరారు. గురువారం వారు జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఆర్. శ్రీనివాసరావును కలిసి వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాలకు, వీచిన గాలులకు మొక్కజొన్న అరటి, బొప్పాయిలతో పాటు ఆకుకూరలు ,కాయగూరలు తదితర పంటలకు అపార నష్టం వాటిలిందన్నారు. కాబట్టి ఆయా గ్రామాల్లో నష్టపోయిన పంటలు విషయమై సర్వే నిర్వహించి రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో నిర్వహించిన పంట నష్టం సర్వే జాబితాలను ఆర్‌బికెల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో బోర్డులు ప్రదర్శించాలన్నారు. రైతులకు నష్టం లేకుండా పరిహారం అందజేయాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఎడి మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో వ్యవసాయ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారని, ఈ నెలాఖరు వరకు గడువుందని అన్నారు. జాబితాలను ఆర్బికేల్లో ఉంచుతామని తెలిపారు. ఎడిని కలిసిన వారిలో జనసేన నాయకులు గొర్లి చంటి, వంగల దాలినాయుడు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బాలేరు పంచాయతి సోలికిరిలో కొత్తకోట నవీన్ కుమార్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, బత్తిలి ఎస్ఐ వై.అమ్మన్నారావు ప్రారంభించారు. ముందుగా నవీన్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఎంపిపి ప్రతినిధి, ఎస్ఐ, కుటుంబ సభ్యులు, పలువురు నాయకులు నివాళ్లు అర్పించారు. అనంతరం భామిని ఎంపిపి మాట్లాడుతూ, ఉన్నత విద్యను అభ్యసించి, కుటుంబ ఎదుగుదల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, చేతికి అంది వచ్చిన కొడుకు అయిన కొత్తకోట నవీన్ కుమార్‌ను గతేడాది ఆ కుటుంబం కోల్పోడం బాధాకరమని, అతని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని తెలిపారు. నవీన్ సోదరుడు బాలేరు ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించి కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్నామన్నారు. అనారోగ్యానికి గురైన కొద్ది రోజుల్లోనే మృతి చెందాడన్నారు.

నవీన్‌కుమార్‌కు నివాళ్లు అర్పిస్తున్న ఎస్ఐ, ఎంపిపి ప్రతినిధి

అనంతరం ఎస్ఐ క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపర్చి, రోజు వారి జీవనంలో క్రీడాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.10వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.5వేలు తో పాటు ట్రోఫీ అందజేస్తామని టోర్నమెంట్ నిర్వాహకులు చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెడ్‌పిటిసి ప్రతినిధి ప్రసాదరావు, వైసిపి నాయకులు కొత్తకోట ఆంజనేయులు, పిఎసిఎస్ అధ్యక్షులు గెల్లంకి రమేష్, మెడిబోయిన చలపతిరావు, చంటి, కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - కురుపాం

జర్నలిస్టుల సమస్యలపై గురువారం స్థానిక తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్‌కు జర్నలిస్ట్ సంఘం నాయకులు నెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాత్రికేయులు వినతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సమస్యలపై పత్రికలు, మీడియా ద్వారా అధికారులకు తెలియజేస్తూ వారి సమస్యలు పరిష్కారమయ్యే వరకూ కృషి చేస్తున్న విలేకరుల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలైన ఇళ్ల స్థలాలిచ్చి, ఇళ్లు కట్టుకోవడానికి నిధులు మంజూరు చేయాలని, జర్నలిస్టు కుటుంబాలకు విద్య, వైద్య సదుపాయాలలో రాయితీలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జి.ఢిల్లీశ్వరరావు, డి.ప్రదీప్, జి.మనోజ్, కె.ఉమామహేశ్వరరావు, పి.సంతోష్ , సిహెచ్.గోపి, వి. శేషు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న పాత్రికేయులు

జర్నలిస్ట్ కుటుంబాన్ని పరామర్శించిన భూదేవి

సీతంపేట: సీనియర్ జర్నలిస్ట్ పసుపురెడ్డి లోకేష్ తల్లి సావిత్రమ్మ గురువారం మృతి చెందగా విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు పడాల భూదేవి పరామర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమె వెంట మాజీ ఎంపిపి ఎస్.కుంపి, మాజీ ఎంపీటీసీ బిడ్డిక జయలక్ష్మి పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రకృతి వ్యవసాయంలో చిరుధాన్యాలు సాగు కోసం ప్రతి రైతు వద్దకు ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు విస్తతంగా తెలియపరచాలని ప్రకృతి వ్యవసాయశాఖ డిడి ప్రకాష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎడిఎ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయం చేసేలా కృషి చేయాలన్నారు. 2023 సంవత్సరాన్ని కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని, దీని కోసం రాష్ట్ర ప్రభుత్వ కూడా చిరు ధాన్యాలు సాగుపై 90శాతం సబ్సిడీపై విత్తానాలను సరఫరా చేస్తుందని, ఈ విషయమై ప్రతి రైతుకూ తెలియజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సాలూరు వ్యవసాయాధికారి తిరుపతి రావు, మూడు మండలాల ఎపిసిఎన్ఎఫ్ కార్యకర్తలు, యశోదమ్మ పాల్గొన్నారు

ర్యాలీ చేస్తున్న ఎపిసిఎన్ఎఫ్ కార్యకర్తలు

సంపద తయారీ కేంద్రం పరిశీలన

సీతానగరం : మండలంలోని పెదబోగిలిలో గల చెత్త సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. చెత్త పదార్థాలు, చెత్తతో తయారైన సేంద్రియ ఎరువులు వానపాములు, పెరుగుదల వర్మీ ఉత్పత్తి అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేంద్రంలో ఈనెల 28, 29లో పార్వతీపురం నియోజకవర్గానికి చెందిన సర్పంచులకు, కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అధికారు లకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నా మన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటి పన్నుల వసూళ్లురూ.4కోట్ల 80 లక్షలుగా లక్ష్యం ఉండగా, ఇప్పటి వరకు రూ.2కోట్లు వసూలైం దన్నారు. మిగతాది నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు గ్రామాల్లో తాగునీరు వీధి దీపాలు క్లోరినేషన్ కోసం 15వ ఆర్థిక సంఘం నిధులను వెచ్చించి పనులు చేయించాలన్నారు ఆయనతో పాటు ఇఒ పిఆర్‌డి కెకె వర్మ, పెదభోగిలి ఇఒ జి.వెంకట్రావు, గుమస్తా ఈదిబిల్లి రమేష్, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ

విద్యార్థులకు ఫోన్ దూరంగా ఉంచాలి

సీతంపేట : విద్యార్థులకు సెల్‌ఫోన్లు తల్లిదండ్రులు ఇవ్వొద్దని ప్రిన్సిపల్ నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పులిపుట్టి సమీపంలో గల భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో టెన్త్‌లో ప్రవేశించనున్న విద్యార్థులకు గురువారం సరస్వతి పూజ, వారి తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను రోజూ స్కూలుకు పంపించాలన్నారు. ఏ సబ్జెక్ట్ లోపం ఉంటే తమకు తెలియజేయాలని, ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు బిడియం, భయం వీడనాడితే సక్సెస్ మీ చుట్టూ తిరుగుతుందని అన్నారు. ప్రణాళిక ప్రకారం చదువుకుంటే 2024 -25 విద్యా సంవత్సరం విద్యార్థులకు శత శాతం ఉత్తీర్ణత సాధించవచ్చని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ వేసవి సెలవులు తక్కువగా ఉంటాయని అవసరమైతే ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తామని, అందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తమ దష్టికి తీసుకురావాలని అన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు మురళీమోహన్, మురళి, సురేష్ కుమార్, శంకర్, పార్వతి, దివాకర్, అప్పలనాయుడు, మోహన్ రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నవీన్‌కుమార్

బైకు ఢీకొని సైక్లిస్ట్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని దత్తివలస వద్ద గల మిత్ర రియల్ ఎస్టేట్ ఎదురుగా గురువారం మామిడిపల్లి నుంచి వస్తున్న నల్లి పైడన్న (70)ను అదే మండలానికి చెందిన కొత్తవలస పంచాయతీకి చెందిన రెయ్యి రాజు ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో పైడన్న తీవ్ర గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు ప్రాథమిక చికిత్సకు తరలించి, అనంతరం కెజిహెచ్‌కు తరలించారు. కేసును రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి దర్యాప్తు చేస్తున్నారు.